గోల్డ్-సిల్వర్ మారథాన్

దేశీయ మార్కెట్‌లో ఆల్‌టైమ్ హైకి బంగారం, వెండి ధరలు

తొలిసారి తులం పుత్తడి రూ.90,750గా నమోదు

రూ.1,02,500 పలికిన కిలో వెండి • ఒక్కరోజే రూ.1,300 చొప్పున పెరిగిన రేట్లు

న్యూఢిల్లీ, మార్చి 17: బంగారం, వెండి ధరలు ఆల్‌టైమ్ హై రికార్డులతో హోరెత్తించాయి. సోమవారం దేశీయ మార్కెట్‌లో అటు గోల్డ్, ఇటు సిల్వర్ రెండింటి రేట్లూ పరుగులు పెట్టాయి. ఏకంగా రూ.1,300 చొప్పున ఎగబాకి మునుపెన్నడూలేని స్థాయిల్లో స్థిరపడ్డాయి. అఖిల భారత సరఫా అసోసియేషన్ వివరాల ప్రకారం ఢిల్లీ స్పాట్ మార్కెట్‌లో 24 క్యారెట్ (99.9 స్వచ్ఛత) 10 గ్రాముల పుత్తడి విలువ రూ.1,300 పుంజుకొని మొదటిసారి రూ.90వేల మార్కును దాటుతూ రూ.90,750గా నమోదైంది. దీంతో మునుపటి రూ.89,450 రికార్డు చెరిగిపోయినట్టైంది. మరోవైపు వెండి ధరలూ దౌడు తీశాయి. కిలో ధర ఈ ఒక్కరోజే రూ.1,300 ఎగిసి రూ.1,02,500గా నమోదైంది. ఈ స్థాయికి వెండి ధర రావడం ఇదే తొలిసారి.

హైదరాబాద్‌లో..

దేశ రాజధానిలో బంగారం మెరిసినా.. రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లో ఆ వెలుగులు కనిపించలేదు. తులం పసిడి రూ.90వేల దిగువనే ఉన్నది. 24 క్యారెట్ గోల్డ్ రేటు రూ.89,560గా రికార్డైంది. అలాగే 22 క్యారెట్ (99.5 స్వచ్ఛత లేదా ఆభరణాల బంగారం) పుత్తడి విలువ 10 గ్రాములు రూ.82,100గా నమోదైంది. మునుపటితో చూస్తే రూ.100 మేర ధరలు తగ్గుముఖం పట్టాయి.

ఇదీ సంగతి..

గోల్డ్, సిల్వర్ రేట్లు ఇంతలా జూమ్ కావడానికి దేశ, విదేశీ పరిస్థితులే కారణంగా నిలుస్తున్నాయి. ప్రధానంగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వేస్తున్న సుంకాలు.. అంతర్జాతీయ మార్కెట్లను కుదిపేస్తున్నాయి. దీంతో గ్లోబల్ ఇన్వెస్టర్లను ట్రేడ్ వార్ భయాలు చుట్టుముట్టాయి. ఈ క్రమంలోనే తమ పెట్టుబడుల రక్షణార్థం.. సురక్షిత పెట్టుబడి సాధనమైన బంగారం, వెండి వైపునకు మదుపరులు అడుగులేస్తున్నారు. పెద్ద ఎత్తున పెట్టుబడులు పెడుతుండటంతో డిమాండ్ ఒక్కసారిగా పెరిగిపోయింది. అలాగే భారత్‌సహా ఆయా దేశాల సెంట్రల్ బ్యాంకులు పసిడి నిల్వలను పెంచుకుంటుండటం కూడా గోల్డ్ మార్కెట్‌ను ప్రభావితం చేస్తున్నదని నిపుణులు తాజా సరళిని విశ్లేషిస్తున్నారు. అంతర్జాతీయ అనిశ్చిత పరిస్థితులు, ఎర్ర సముద్రంలో పెరుగుతున్న ఉద్రిక్తతలు, ద్రవ్యోల్బణం తగ్గడంతో రాబోయే ద్రవ్యసమీక్షల్లో ఫెడ్ రిజర్వ్ వడ్డీరేట్లను మరింత తగ్గిస్తుందన్న అంచనాలు కూడా ధరలను ఎగదోస్తున్నాయన్న అభిప్రాయాలు వినిపిస్తున్నాయి.

- ఈ ఏడాది మొదలు ఇప్పటిదాకా దేశీయంగా రూ.11,360 లేదా 14.31 శాతం ఎగిసిన తులం బంగారం ధర. జనవరి 1న 24 క్యారెట్ 10 గ్రాములు రూ.79,390గానే ఉన్నది.
- మల్టీ కమోడిటీ ఎక్స్ఛేంజ్‌లో ఏప్రిల్ నెల కుగాను గోల్డ్ ఫ్యూచర్స్ 10 గ్రాములు రూ.88,004 పలికింది.
- అంతర్జాతీయ మార్కెట్లలో ఔన్స్ గోల్డ్ 14.48 డాలర్లు పెరిగి 2,998.90 డాలర్లుగా ఉన్నది. శుక్రవారం 3వేల డాలర్లను తాకిన విషయం తెలిసిందే.
- కోమెక్స్ గోల్డ్ ఫ్యూచర్స్‌లో 3,007 డాలర్లు పలికిన ఔన్స్ బంగారం. శుక్రవారం 3,017.10 డాలర్లుగా ఉన్నది.

ధరల పెరుగుదలకు ప్రధాన కారణాలు

- అమెరికా టారిఫ్‌లు
- వాణిజ్య యుద్ధం భయాలు
- అంతర్జాతీయ ఆర్థిక అనిశ్చిత పరిస్థితులు
- స్టాక్ మార్కెట్లలో తీవ్ర ఒడుదొడుకులు
- బంగారంపై పెట్టుబడులపట్ల మదుపరుల ఆసక్తి
- ఫెడ్ రిజర్వ్ వడ్డీరేట్ల కోతల అంచనాలు

రూ.16.35 లక్షల కోట్లు

గత పదేండ్లలో బ్యాంకులు రైటాఫ్ చేసిన మొండి బకాయిలు

పార్లమెంట్‌లో ప్రకటించిన కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్



న్యూఢిల్లీ, మార్చి 17: బ్యాంకులకు కుచ్చుటోపీలు పెడుతున్న కేటుగాళ్లు.. గుదిబండలుగా మారుతున్న కార్పొరేట్లు.. అధికారులతో కలిసి వందలు, వేల కోట్లను మోసం చేస్తున్న ఘరానా మోసగాళ్ల ఆగడాలు ఎంతకీ తగ్గడం లేదు. గడిచిన 10 ఆర్థిక సంవత్సరాల్లో దేశంలోని బ్యాంకులు దాదాపు రూ.16.35 లక్షల కోట్ల విలువైన మొండి బకాయిల (ఎన్‌పీఏ లేదా నిరర్థక ఆస్తులు)ను రైటాఫ్ చేశాయని సోమవారం లోక్‌సభలో ఓ ప్రశ్నకు బదులిస్తూ కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించారు మరి. సామాన్యుల దగ్గర్నుంచి ముక్కుపిండి వసూలు చేసే బ్యాంకర్లు.. వేల కోట్లను ఎగవేసినా ఏండ్ల తరబడి కిమ్మనకుండా ఉండిపోతుండటం.. రైటాఫ్‌ల పేరిట ఖాతా పుస్తకాలను క్లియర్ చేసుకుంటుండటం.. అటు పాలనాపరంగా, ఇటు చట్టాలు-వ్యవస్థల్లోని లోపాలను ఎత్తిచూపిస్తున్నాయి.

ఒక్క ఏడాదే రూ.2.36 లక్షల కోట్లు

2018-19 ఆర్థిక సంవత్సరంలో గరిష్ఠంగా రూ.2,36,265 కోట్ల ఎన్‌పీఏలు రైటాఫ్ అయినట్టు మంత్రి సీతారామన్ చెప్పారు. అలాగే కనిష్ఠంగా 2014-15లో రూ.58,786 కోట్ల లోన్లు రైటాఫ్ జరిగినట్టు తెలిపారు. కాగా, గత ఆర్థిక సంవత్సరం (2023-24) రూ.1,70,270 కోట్ల రైటాఫ్‌లు జరిగితే.. అంతకు ముందు ఆర్థిక సంవత్సరం (2022-23) రూ.2,16,324 కోట్ల నిరర్థక ఆస్తులను రైటాఫ్ చేసినట్టు వివరించారు. అయితే రైటాఫ్ వల్ల రుణగ్రహీతకు లాభం జరిగినట్టు అనుకోవద్దని, తీసుకున్న అప్పు తిరిగి చెల్లించాల్సిందేనని మంత్రి ఈ సందర్భంగా స్పష్టం చేశారు. సదరు బాకీల వసూలుకు బ్యాంకులు రకరకాలుగా ప్రయత్నిస్తూనే ఉంటాయన్నారు. కోర్టుల్లో కేసులు వేయడం, డెట్ రికవరీ ట్రిబ్యునళ్లను ఆశ్రయించడం, దివాలా చట్టం కింద నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్స్‌కు వెళ్లడం, అసెట్ రీకన్‌స్ట్రక్షన్ కంపెనీలకు ఎన్‌పీఏలను అమ్మేయడం వంటివి చేస్తుంటాయని వివరించారు.

ఆర్బీఐ డాటాలో..

గత ఏడాది డిసెంబర్ 31నాటికి షెడ్యూల్డ్ కమర్షియల్ బ్యాంకుల్లో 29 యూనిక్ బారోవర్ కంపెనీలున్నాయని, వీటన్నింటినీ ఎన్‌పీఏలుగానే వర్గీకరించారని, ఒక్కోటి రూ.1,000 కోట్లు, ఆపైనే బకాయిపడ్డాయని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) గణాంకాలు చెప్తున్నాయి. ఈ 29 కంపెనీల మొండి బకాయిల విలువ రూ.61,027 కోట్లుగా ఉండటం గమనార్హం.

జియోహాట్‌స్టార్ 90 రోజులు ఉచితం

- ఐపీఎల్ లవర్స్‌కు భలే ఆఫర్

న్యూఢిల్లీ, మార్చి 17: ఐపీఎల్ లవర్స్‌కు రిలయన్స్ జియో బంపర్ ఆఫర్ ఇచ్చింది. త్వరలో ఐపీఎల్ మ్యాచ్‌లు మొదలవుతున్న క్రమంలో ప్రస్తుత, కొత్త జియో సిమ్ కస్టమర్లు రూ.299, ఆపై ప్లాన్లను రిచార్జ్ చేసుకుంటే 90 రోజుల పాటు ఉచితంగానే జియోహాట్‌స్టార్ సబ్‌స్క్రిప్షన్ లభించనున్నది మరి. అయితే ప్రస్తుత జియో నెట్‌వర్క్ వినియోగదారులు సోమవారం నుంచి ఈ నెలాఖరు (మార్చి 17 నుంచి మార్చి 31) మధ్య మొబైల్ ఫోన్ రిచార్జ్ చేసుకుంటేనే ఈ సదుపాయం ఉంటుంది. అలాగే ఈ తేదీల్లో కొత్తగా జియో నెట్‌వర్క్‌లోకి వచ్చే కస్టమర్లు ఈ ఆఫర్ కోసం రూ.299 (1.5జీబీ/డే లేదా ఆపైన), అంతకన్నా ఎక్కువ మొత్తంలో ప్లాన్లనే రిచార్జ్ చేసుకోవాల్సి ఉంటుంది. కాగా, మార్చి 17కు ముందు మొబైల్ రిచార్జ్ చేసుకున్నవారు రూ.100తో యాడ్-ఆన్ ప్యాక్ వేసుకుంటే మార్చి 22 నుంచి జియోహాట్‌స్టార్ ఫ్రీ సబ్‌స్క్రిప్షన్ యాక్టివేట్ అవుతుంది. ఈ నెల 22 నుంచే ఐపీఎల్ మ్యాచ్‌లు ప్రారంభమవుతున్న సంగతి విదితమే. ఇదిలావుంటే ఇంటి కోసం 50 రోజుల జియోఫైబర్/ఎయిర్‌ఫైబర్ ట్రయల్ కనెక్షన్ ఆఫర్ కూడా ఉన్నట్టు జియో చెప్తున్నది.

ద్రవ్యోల్బణం పైకి.. ఎగుమతులు కిందికి

- ఫిబ్రవరిలో పెరిగిన టోకు ధరల సూచీ.. 2.38 శాతంగా నమోదు
- గత నెల దేశీయ ఎగుమతులు 36.91 బిలియన్ డాలర్లే

న్యూఢిల్లీ, మార్చి 17: గత నెల ఫిబ్రవరిలో టోకు ద్రవ్యోల్బణం మళ్లీ విజృంభించింది. ఇదే సమయంలో దేశీయ ఎగుమతులు మరోసారి నిరాశపర్చాయి. సోమవారం విడుదలైన అధికారిక గణాంకాల ప్రకారం టోకు ధరల సూచీ (డబ్ల్యూపీఐ) ఆధారిత హోల్‌సేల్ ఇన్‌ఫ్లేషన్ 2.38 శాతంగా నమోదైంది. వంటనూనెలు, శీతలపానీయాలు తదితర తయారీ రంగ ఆహారోత్పత్తుల రేట్లు పెరిగాయని కేంద్ర ప్రభుత్వం చెప్తున్నది. వంటనూనె ధర 33.59 శాతం పెరిగింది. కాగా, అంతకుముందు నెల జనవరిలో ఇది 2.31 శాతంగానే ఉన్నది. ఇక గత ఏడాది ఫిబ్రవరిలోనైతే 0.2 శాతమే.

వాణిజ్య లోటు 14.05 బిలియన్ డాలర్లు

దేశీయ ఎగుమతులు వరుసగా నాలుగో నెలా క్షీణించాయి. ఫిబ్రవరిలో 36.91 బిలియన్ డాలర్లే. దిగుమతులు 50.96 బిలియన్ డాలర్లుగా ఉన్నాయి. దీంతో వాణిజ్య లోటు 14.05 బిలియన్ డాలర్లుగా ఉన్నది. పెట్రోలియం ధరల్లో ఒడుదొడుకులు, అంతర్జాతీయ అనిశ్చిత పరిస్థితులే ఎగుమతుల క్షీణతకు కారణమని కేంద్రం చెప్తున్నది.

మారుతీ, టాటా వాహనాలు ప్రియం

ఏప్రిల్ నుంచి 4 శాతం వరకు పెరగనున్న మారుతీ సుజుకీ కార్ల ధరలు

2 శాతం వరకు పెరగబోతున్న టాటా వాణిజ్య వాహనాల రేట్లు

న్యూఢిల్లీ, మార్చి 17: దేశీయ ఆటో రంగ దిగ్గజ సంస్థలైన మారుతీ సుజుకీ, టాటా మోటర్స్ తమ వాహనాల ధరల్ని వచ్చే నెల నుంచి పెంచబోతున్నట్టు సోమవారం ప్రకటించాయి. ఇప్పటికే ఈ ఏడాది ధరల్ని ఒకసారి పెంచిన కంపెనీలు.. మరోసారి పెంచాలని చూస్తుండగా, పెరిగిన తయారీ ఖర్చులు, నిర్వహణ వ్యయాల దృష్ట్యా తప్పట్లేదని చెప్తున్నాయి. ఇదిలావుంటే ఏప్రిల్ నుంచి తమ కార్ల ధరలు మాడల్‌నుబట్టి 4 శాతం వరకు పెరుగుతాయని మారుతీ సుజుకీ స్పష్టం చేసింది. టాటా మోటర్స్ కూడా తమ వాణిజ్య వాహనాల ధరలు 2 శాతం వరకు పెరుగుతాయని తెలిపింది. నిజానికి కస్టమర్లపై ధరల పెంపు ప్రభావాన్ని తగ్గించాలని వీలైనంతదాకా కంపెనీయే భరిస్తున్నదని, అయినప్పటికీ ఎంతోకొంత కొనుగోలుదారులపై భారం వేయక తప్పడం లేదని మారుతీ సుజుకీ తెలియజేసింది. ఇక ఈ ఏడాది జనవరిలో కార్ల ధరల్ని మాడల్‌నుబట్టి రూ.32,500 వరకు మారుతీ పెంచింది. పెరిగిన ధరలు ఫిబ్రవరి 1 నుంచి అమల్లోకి వచ్చాయి. ప్రస్తుతం దేశీయ మార్కెట్‌లో ప్రారంభ స్థాయి మాడల్‌గా ఆల్టో కే-10ను మారుతీ అమ్ముతున్నది. ఢిల్లీ ఎక్స్‌షోరూం ప్రకారం దీని ధర రూ.4.23 లక్షలుగా ఉన్నది. అలాగే మారుతీ కార్లలో గరిష్ఠ ధర రూ.29.22 లక్షలు. ఇదిలావుంటే వచ్చే నెల నుంచి కార్ల ధరలను పెంచే యోచనలో ఉన్నామని హోండా కార్స్ ఇండియా కూడా చెప్తున్నది. అయితే హ్యుండాయ్ మోటర్ ఇండియా మాత్రం ఈ విషయంలో ఇప్పుడే స్పందించేందుకు నిరాకరించింది.

లాభాల్లో దేశీయ స్టాక్ మార్కెట్లు

ముంబై, మార్చి 17: దేశీయ స్టాక్ మార్కెట్లు సోమవారం లాభాల్లో ముగిశాయి. బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్ఈ) ప్రధాన సూచీ సెన్సెక్స్ 341.04 పాయింట్లు పెరిగి 74,169.95 వద్ద స్థిరపడింది. దీంతో గత ఐదు రోజులుగా వాటిల్లుతున్న నష్టాలకు తెరపడినట్టైంది. ఇక నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్‌ఎస్ఈ) సూచీ నిఫ్టీ 111.55 పాయింట్లు అందుకుని 22,508.75 వద్ద నిలిచింది. బీఎస్ఈలో హెల్త్‌కేర్, కమోడిటీస్, ఆటో, బ్యాంకింగ్ రంగాల షేర్లు 1.12 శాతం నుంచి 0.71 శాతం వరకు పుంజుకున్నాయి. ఓలా ఎలక్ట్రిక్ షేర్లు ఆల్‌టైమ్ కనిష్ఠాన్ని తాకాయి. మార్కెట్ విలువ రూ.1,601 కోట్లు తగ్గింది.

ఇసుక బజార్లలో మూసీ ఇసుక

రాష్ట్ర లారీ ఓనర్స్ అసోసియేషన్

హైదరాబాద్, మార్చి 17(నమస్తే తెలంగాణ)/రామంతపూర్ : ప్రభుత్వం ఏర్పాటుచేసిన ఇసుక బజార్లలో రూ.1600-1800కు విక్రయిస్తున్న ఇసుక మూసీ నదిలో తీస్తున్నదని, గోదావరి, కృష్ణా నదుల ఇసుకతో పోల్చితే ఇది నాసిరకంగా ఉంటుందని తెలంగాణ రాష్ట్ర లారీ ఓనర్స్ అసోసియేషన్ నాయకులు పేర్కొన్నారు. ప్రభుత్వం ఈ నాసిరకం ఇసుకను విక్రయిస్తూ ప్రజలను మోసం చేస్తున్నదని విమర్శించారు. మూసీ నది ఇసుకను తాము టన్ను రూ. 1200కే సరఫరా చేస్తామని అసోసియేషన్ నాయకులు సవాల్ చేశారు. నూతన ఇసుక విధానంపై సోమవారం ఉప్పల్‌లోని ఓ హోటల్‌లో ఇసుక లారీల సంఘాల ప్రతినిధులు సమావేశమయ్యారు. దీనిపై ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

ఇసుక ధరతోపాటు ప్రభుత్వ ఆదాయమూ పెరిగింది : టీజీఎండీసీ

ఇసుక ధర పెరిగి ప్రజలపై పడుతున్న భారం సంగతి ఎలావున్నా ప్రభుత్వానికి వచ్చే ఆదాయం మాత్రం గణనీయంగా పెరిగిందని టీజీఎండీసీ పేర్కొంది. 'టన్ను ఇసుక ధర రూ. 1800' శీర్షికన సోమవారం 'నమస్తే తెలంగాణ'లో ప్రచురితమైన వార్తకు స్పందిస్తూ, హైదరాబాద్‌లోని వివిధ ఇసుక అడ్డాల్లో ధర టన్నుకు రూ. 1900నుంచి రూ. 2200వరకు నడుస్తున్నదని అధికారులు అంగీకరించారు.

డీఏలు, పీఆర్సీ ఇవ్వలేమనడం సరికాదు

యూఎస్‌పీఎస్సీ స్టీరింగ్ కమిటీ

హైదరాబాద్, మార్చి 17 (నమస్తే తెలంగాణ): ఉద్యోగులు డీఏ, పీఆర్సీలు అడగొద్దని, నెలనెలా జీతాలు ఇవ్వలేకపోతున్నామని సీఎం ప్రకటించడాన్ని ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ (యూఎస్‌పీఎస్సీ) తీవ్రంగా ఖండించింది. బకాయిపడ్డ నాలుగు డీఏలు, జూలై 2023 నుంచి అమలు చేయాల్సి పీఆర్సీని అడగొద్దని సాక్షాత్తు సీఎం అనడం సమంజసం కాదని యూఎస్‌పీఎస్సీ స్టీరింగ్ కమిటీ నేత చావా రవి సోమవారం ఒక ప్రకటన పేర్కొన్నారు. ఉద్యోగులు గొంతెమ్మ కోర్కెలు కోరడం లేదని, న్యాయంగా రావాల్సిన బకాయిలు, వారు దాచుకున్న డబ్బులను మాత్రమే అడుగుతున్నారని అన్నారు.

గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ చేతుల మీదుగా అవార్డులు అందుకుంటున్న నమస్తే తెలంగాణ ఫొటో జర్నలిస్టులు గోపీకృష్ణ, గోపి, శ్రీనివాస్, వెంకన్న, శ్రీధర్

చరిత్రలో నిలిచిపోయేది ఫొటో

- వెయ్యి మాటల కన్నా.. ఒక్క ఫొటో ఎంతోగొప్పది
- ఫొటోగ్రఫీలో తెలంగాణ, త్రిపుర రాష్ట్రాలకు గొప్ప చరిత్ర
- అవార్డుల ప్రదానోత్సవంలో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

రవీంద్రభారతి, మార్చి17: చరిత్రలో నిలిచిపోయేది ఫొటోనేనని, వెయ్యి మాటల కన్న ఒక్క ఫొటో ఎంతో గొప్పదని రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అన్నారు. ఆ రోజుల్లో ప్రప్రథమంగా దేశంలో కెమెరాలు కొనుగోలు చేసి ఫొటోగ్రఫీని అభివృద్ధి చేసిన ఘనత హైదరాబాద్, త్రిపుర సంస్థానాలకే దక్కిందని అన్నారు. సోమవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో తెలంగాణ స్టేట్ ఫొటో జర్నలిస్ట్స్ అసోసియేషన్ నిర్వహించిన ఉత్తమ ఫొటో జర్నలిస్టు అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమానికి ఆయన విచ్చేసి ఉత్తమ ఫొటో జర్నలిస్టులకు అవార్డులను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పత్రికల్లో ఎన్ని వార్తలు ప్రచురితమైనా.. పాఠకుల దృష్టిని ఆకర్షించేది ఫొటోలు మాత్రమేనని ఆయన స్పష్టంచేశారు. ప్రస్తుతం సోషల్ మీడియా ప్రభావంతో పత్రికలకు ఆదరణ తగ్గిపోతున్నదని.. కానీ ఇది తాత్కాలికం మాత్రమేనని, భవిష్యత్ పత్రికలకే ఉంటుందని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమానికి ఐజేయు స్టీరింగ్ కమిటీ సభ్యుడు దేవులపల్లి అమర్, రాష్ట్ర టూరిజం అభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేశ్‌రెడ్డి, అఖిలభారత రైస్ మిల్లర్స్ అసోసియేషన్స్ అధ్యక్షుడు తూడి దేవేందర్‌రెడ్డి, టీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు విరాహత్‌అలీ, ప్రధాన కార్యదర్శి కే నారాయణ, గంగాధర్, కేఎన్ హరి తదితరులు పాల్గొన్నారు.

అవార్డులు అందుకున్న నమస్తే తెలంగాణ ఫొటో జర్నలిస్టులు..

గడసంతల శ్రీనివాస్, ఎం గోపికృష్ణ (హైదరాబాద్), బందగీ గోపి (మహబూబ్‌నగర్), గొట్టె వెంకన్న(వరంగల్), సూర్య శ్రీధర్ (తెలంగాణ టుడే) గవర్నర్ చేతుల మీదుగా అవార్డులు అందుకున్న వారిలో ఉన్నారు.

'వీఏవో'లుగా వీఆర్వోలు

పరీక్షలు లేకుండానే రెవెన్యూలోకి బదిలీ

హైదరాబాద్, మార్చి 17 (నమస్తే తెలంగాణ): ప్రభుత్వం త్వరలో గ్రామాల్లో నియమించనున్న రెవెన్యూ అధికారులకు విలేజ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ (వీఏవో) పేరు నిర్ణయించినట్టు తెలిలిసింది. భూ భారతి చట్టం అమలులో భాగంగా ప్రతి రెవెన్యూ గ్రామానికి ఒకరు చొప్పున 10,950 మంది క్షేత్రస్థాయి అధికారులను నియమించేందుకు ఈ నెల 7న జరిగిన క్యాబినెట్ సమావేశంలో నిర్ణయించారు. 'గ్రామ పాలనాధికారులు'గా పూర్వ వీఆర్వోలు, వీఆర్ఏలను నియమించాలని ఇప్పటికే ప్రభుత్వం నిర్ణయించింది. అయితే ఎంత మందిని తీసుకుంటారనేదానిపై రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఉన్నతాధికారులు భిన్నమైన ప్రకటనలు చేశారు. తాజా సమాచారం ప్రకారం మొత్తం పోస్టులను పూర్వ వీఆర్వోలు, వీఆర్వోలతో భర్తీ చేయనున్నట్టు తెలుస్తున్నది. కొన్ని నెలల కిందట వీఏవోలతోపాటు వెయ్యి మంది సర్వేయర్ల భర్తీకి విల్లింగ్ తీసుకోగా.. పెద్దగా ఆసక్తి కనిపించలేదు.

విధులు.. సర్వీస్ సంగతేంది?

రెవెన్యూలో క్యాడర్ స్ట్రెంత్, జీతభత్యాల కేటాయింపు వంటివి ఇంకా నిర్ణయం కాలేదు. వీఏవోలను ఏ పేస్కేల్‌తో తీసుకుంటారు? ఇందుకు కనీస అర్హత ఏమిటి? విధులేమిటి వంటివి కూడా ఇంకా తేలలేదు. అవి బయటికి వచ్చిన తర్వాత ఎంత మంది తిరిగి వెళ్లేందుకు సిద్ధమవుతారన్నది మరో ప్రశ్నగా ఉన్నది. నాలుగేండ్లుగా ఇతర శాఖల్లో తాము విధులు నిర్వహిస్తున్నామని, ఈ సర్వీస్‌ను కొససాగిస్తారా? అని ప్రశ్నిస్తున్నారు. కనీస అర్హత డిగ్రీ ఉంటే ఇప్పుడు విల్లింగ్ ఇచ్చినవారిలో 3,500 మంది మాత్రమే వచ్చే అవకాశం ఉన్నది. అనేక అంశాలు తేలాల్సి ఉన్న నేపథ్యంలో వీఏవో వ్యవస్థ అమలు ఉగాది నుంచి కష్టమేనని సీనియర్ అదికారులు చెప్తున్నారు. ఉగాదిన లాంఛనంగా ప్రారంభించి, ఏప్రిల్‌లో నియామక ప్రక్రియ జరిపే అవకాశం ఉన్నదని పేర్కొన్నారు.

నేడు అసెంబ్లీకి ఎస్సీ వర్గీకరణ బిల్లు

హైదరాబాద్, మార్చి 17 (నమస్తే తెలంగాణ): దశాబ్దాలుగా నలిగిపోయిన ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణలో కీలక ఘట్టానికి చేరుకుంది. నిరుడు సుప్రీంకోర్టు తీర్పుతో మార్గం సుగమం కావడంతో ఆ మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ బిల్లులను నేడు అసెంబ్లీలో ప్రవేశపెట్టేందుకు సిద్ధమైంది. మరోవైపు అసెంబ్లీలో సోమవారం ప్రభుత్వం ఐదు బిల్లులు ప్రవేశపెట్టగా మూడు బిల్లులను సభ ఏకగ్రీవంగా ఆమోదించింది. బీసీలకు విద్య, ఉద్యోగాల్లో 42 శాతం రిజర్వేషన్ బిల్లు, స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ బిల్లు, తెలుగు యూనివర్సిటీకి సురవరం ప్రతాపరెడ్డి పేరును ప్రతిపాదిస్తూ చేసిన సవరణ బిల్లు ఉన్నాయి. ఇక దేవాదాయ చట్ట సవరణ బిల్లు, ఎస్సీ వర్గీకరణ బిల్లులు ఉండగా సభవాయిదా పడటంతో నేడు సభ ముందుకు రానున్నాయి.

చిరకాలస్వప్నం.. సుప్రీంకోర్టు తీర్పుతో సాకారం!

ఎస్సీలకు రాజ్యాంగబద్ధంగా 15శాతం రిజర్వేషన్ అమలవుతున్నది. ఆ కోటాలో మాలలే ఎక్కువగా లబ్ధిపొందుతున్నారనే చర్చ 1970 దశకంలోనే మొదలైంది. అది క్రమేణా ఊపందుకున్నది. వాస్తవంగా జనాభాపరంగా మాలలకన్నా మాదిగల సంఖ్య ఎక్కువైయినప్పటికీ, విద్యా, ఉద్యోగావకాశాల్లో మాదిగలు చాలా తక్కువ స్థాయిలో ఉన్నారనేది వర్గీకరణ ఉద్యమానికి మూలం. తమకు అన్యాయం జరుగుతున్నదని మాదిగల పోరాటంతో ఎట్టకేలకే ఈ అంశంపై 1995లో ప్రభుత్వం జస్టిస్ రామచంద్రరాజు కమిషన్‌ను నియమించింది. మాదిగల వాదన నిజమేనని సమర్థిస్తూ ఆ కమిషన్ 1996లో తన నివేదికను సమర్పించగా, దాని ఆధారంగా 1997 జూన్‌లో ఆనాటి తెలుగుదేశం ప్రభుత్వం 15 శాతం ఎస్సీ కోటాను ఏ, బీ, సీ, డీగా వర్గీకరిస్తూ జీవో విడుదల చేసింది. 2000లో ఉమ్మడి ఏపీ ప్రభుత్వం ఎస్సీలను వర్గీకరిస్తూ రిజర్వేషన్ల హేతుబద్ధీకరణ చట్టం చేసింది. అసెంబ్లీ ఏకగ్రీవంగా ఆమోదించగా, రాష్ట్రపతి ఆమోదంతో అమల్లోకి వచ్చింది. 2004లో సుప్రీంకోర్టు దాన్ని కొట్టివేయడంతో చట్టానికి చుక్కెదురైంది. ఎస్సీ కులాల జాబితాలో జోక్యం, పునర్‌వర్గీకరణ అధికారం రాష్ట్ర ప్రభుత్వాలకు లేదని న్యాయస్థానం తేల్చిచెప్పింది. నాటి నుంచి ఈ పంచాయితీ పెండింగ్ ఉన్నది.

తెలంగాణలో మంత్రులే కాంట్రాక్టర్లు

భద్రాద్రి జిల్లా పర్యటనలో జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు హుస్సేన్

చండ్రుగొండ/ అశ్వారావుపేట/అశ్వారావుపేట రూరల్, మార్చి 17: తెలంగాణలో మంత్రులే కాంట్రాక్టర్లయితే బడ్జెట్ వారికే సరిపోతుందని జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోత్ హుస్సేన్‌నాయక్ ధ్వజమెత్తారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ముగ్గురు రాష్ట్ర మంత్రులున్నా.. ఈ ప్రాంత పేదలకు ఒరిగిందేమీ లేదని విమర్శించారు. భద్రాద్రి జిల్లా చండ్రుగొండ మండలంలో సోమవారం పర్యటించిన ఆయన.. సీతాయిగూడెం శివారులోని వెంగళరావు ప్రాజెక్టు అలుగు తెగిన ప్రదేశాన్ని పరిశీలించి, ప్రాజెక్టు అలుగు నిర్మాణంపై నెల రోజుల్లో నివేదికని ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. గిరిజనుల కోసం రాష్ట్ర బడ్జెట్‌లో రూ.17 వేల కోట్ల నిధులు ఖర్చు చేస్తామని చెప్పిన రాష్ట్ర ప్రభుత్వం.. ఒక్క రూపాయి కూడా ఇవ్వకపోవడం సరికాదన్నారు. భద్రాద్రి జిల్లా అశ్వారావుపేట మండలం గుమ్మడవల్లి సమీపంలో నిరుడు దెబ్బతిన్న పెదవాగు ప్రాజెక్టును పరిశీలించి రైతులతో సమావేశమయ్యారు.

న్యాయం చేయకుంటే బిల్లును వ్యతిరేకిస్తాం

మాల సంఘాల జేఏసీ చైర్మన్ జీ చెన్నయ్య వెల్లడి

ఖైరతాబాద్, మార్చి 17: ప్రభుత్వ హామీ ప్రకారం మాలలకు న్యాయం చేయకుంటే ఎస్సీ వర్గీకరణ బిల్లును వ్యతిరేకిస్తామని మాల సంఘాల జేఏసీ చైర్మన్ చెన్నయ్య తెలిపారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన చేవెళ్ల డిక్లరేషన్ హామీని వెంటనే అమలు చేయాలని మాల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బత్తుల రాంప్రసాద్ డిమాండ్ చేశారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియాతో మాట్లాడారు.

విద్యకు నిధులు పెంచాలి

గవర్నర్‌కు టీచర్స్ ఎమ్మెల్సీ మల్క కొమరయ్య వినతి

హైదరాబాద్, మార్చి 17 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర బడ్జెట్‌లో విద్యకు 30 శాతం నిధులు పెంచేలా రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించాలని టీచర్స్ ఎమ్మెల్సీ మల్క కొమురయ్య రాష్ట్ర గవర్నర్ జిష్ణు